

టన్ను చీనీ రూ.22 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.34
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.34, కనిష్టంగా రూ.26 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.8°/23.3°

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సేవలతో ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి
- తహసీల్దార్లకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ దిశానిర్దేశం



వీసీలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు మెరుగైన సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ రెవెన్యూ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి రెవెన్యూ అంశాలపై జిల్లాలోని తహసీల్దార్లందరితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఒక వ్యక్తి జననం నుంచి మరణం దాకా పలు రకాల సేవలు అందజేసే ఏకైక శాఖ రెవెన్యూ మాత్రమేనన్నారు. అంతటి కీలకమైన శాఖలో పనిచేసే ఉద్యోగులు నేర్పుతో ప్రజలకు సేవలందించాలని, తద్వారా మంచి పేరు వస్తుందన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలు ఓపికతో విని చిత్తశుద్ధితో సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో అలసత్వం పనికిరాదన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ వేగవంతం కావాలన్నారు. సమావేశంలో పుట్టపర్తి మున్సిపల్ అధికారి అంజయ్య, తహసీల్దార్లు పాల్గొన్నారు.

'ఉత్తమ' అవార్డు కోసం దరఖాస్తుల ఆహ్వానం
పుట్టపర్తి: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం టీచర్లు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఈ అవార్డుకు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులంతా అర్హులేనన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 15వ తేదీలోపు https:// nationalawardsto teachers.education.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పంపాలని సూచించారు.

'ఎన్‌ఎంఎంఎస్'కు వివరాలు సమర్పించాలి
పుట్టపర్తి: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) కోసం గత ఏడాది డిసెంబర్‌లో పరీక్ష రాసి ఎంపికైన విద్యార్థులు తమ వివరాలు సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు సూచించారు. ఆగస్టు 31వ తేదీలోపు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు పంపాలన్నారు. 2020–21, 2021–22 విద్యా సంవత్సరాల్లో స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు సైతం రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

బాల్యం.. బందిఖానా!

- పదో తరగతి పూర్తి చేసిన ధర్మవరానికి చెందిన ఓ బాలికను 25 ఏళ్ల యువకుడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న అధికారులు బాలిక తల్లిదండ్రులను ఆరా తీయగా.. తమకు సంబంధం లేదని తప్పుకున్నారు. దీంతో అధికారులూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు. ఇపుడా బాలిక తెలిసీ తెలియని వయస్సులోనే సంసార సాగరంలో చిక్కుకుపోయింది.
- అమడగూరుకు చెందిన ఓ యువకుడు బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ ఓ బాలికను ప్రేమించి రహస్య వివాహం చేసుకుని జిల్లాకు చేరుకున్నాడు. బాలిక బంధువులు పోలీసులను ఆశ్రయించగా.. కొన్ని నెలల తర్వాత ధర్మవరంలో బాలిక ఆచూకీ కనిపించింది. అప్పటికే బాలిక గర్భం దాల్చింది. పైగా 18 ఏళ్లు దాటి పది రోజులు పూర్తి కావడంతో పోలీసులు ఇరు కుటుంబాలకు సర్దిజెప్పి పంపించారు.

..ఇలా ఎందరో బాలికలు చిరుప్రాయంలోనే మోయలేని భారాలు మోస్తున్నారు. కొన్ని ఘటనల్లో తల్లిదండ్రులే చిన్నారులకు పెళ్లిళ్లు చేస్తుండగా..ఎవరికి చెప్పుకోవాలో తెలియని ఆ పసి హృదయాలు తల్లడిల్లిపోతున్నాయి.

- చిన్న వయసులోనే పెళ్లిళ్లు
- పసిమొగ్గలకు భారంగా గర్భాలు
- అవగాహన కల్పిస్తోన్న అధికారులు
- ఐదు నెలల్లో 57 బాల్య వివాహాలకు అడ్డుకట్ట
- ఆర్థిక సమస్యల కారణంగానే మెడలో తాళి
- గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం

సాక్షి, పుట్టపర్తి

బడిలో ఆడుతూ పాడుతూ తిరగాల్సిన బాలిక.. ఇంట్లో బందీగా మారిపోతోంది. చిరుప్రాయంలోనే మోయలేని భారం మోస్తోంది. తెలిసో, తెలియకో...ఇంట్లో వారు చెప్పారనో మూడుముళ్లు వేయించుకుని పసిప్రాయంలోనే గర్భం దాలుస్తోంది. చిన్నవయస్సులోనే ఎన్నో ఆరోగ్య సమస్యలతో సతమతమవుతోంది. వీటన్నింటికీ బాల్యవివాహాలే కారణమవుతుండగా... జిల్లాలో వీటిని అరికట్టేందుకు యంత్రాంగం అహర్నిశలు పనిచేస్తోంది.

కనిపించని మార్పు..
బాల్య వివాహాలు ఏ రకంగానూ మంచిది కాదని



చెబుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, చట్టాలు చేసినా.. ప్రజల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. మహిళా సాధికారతకు, బాలికల చదువుకు ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నా.. కొందరు తల్లిదండ్రులు మాత్రం మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారు. తమ కూతుళ్లను చదివించడం కంటే వివాహం చేసి పంపడమే మేలని భావిస్తున్నారు. జీవితమంటే ఏమిటో తెలియని పసి వయసులోనే ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేయడం, అంతలోనే గర్భం దాల్చడం వంటి ఘటనలు జిల్లాలో పెరిగిపోతున్నాయి. మరోవైపు బాల్య వివాహాలతో పాటు ప్రేమ వివాహాలు కూడా తెలిసీ తెలియని వయసులోనే జరిగిపోతున్నాయి.

చిన్న వయసులోనే గర్భం భారం..
బాల్య వివాహాల కారణంగా చిన్న వయసులోనే బాలికలు గర్భం దాలుస్తున్నారు. ఫలితంగా శారీరకంగా ఎదుగుదల లోపించడంతో పాటు పలు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. పోలీసులు, శిశు సంక్షేమ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నా.. గుట్టుగా పిల్లలకు మూడు ముళ్ల తంతు సాగిస్తున్నారు. ఆర్థిక సమస్యల కారణంగా కొందరు తల్లిదండ్రులు చిన్న వయసులోనే బాలికలను ఇల్లు దాటించేందుకు పెళ్లిళ్లు చేస్తున్నారు. బాల్య వివాహాలకు మరో ప్రధాన కారణం 'ప్రేమ'గా తెలుస్తోంది. పోకిరీల ప్రేమ వలకు ఆడపిల్లలు బలి అవుతున్నారు. ప్రేమించిన వాడు మోసం చేసి పారిపోగా, అప్పటికే గర్భం దాల్చుతున్న బాలికలు పడరాని పాట్లు పడుతున్నారు. పోలీసులను ఆశ్రయించినా.. పోక్సో కేసు నమోదు చేసి పంపుతున్నారు. ఇలాంటి కేసులు కదిరి పోలీస్ సబ్ డివిజన్‌లో ఎక్కువగా వెలుగు చూశాయి. తప్పు ఎవరిదనే విషయం పక్కన బెడితే బాల్యంలోనే చాలా మంది మోసపోతున్నారు. ఓవైపు అనారోగ్యం, మరోవైపు సమాజం నుంచి ఛీత్కారాలతో దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. ఇక ప్రేమ వివాహం సఫలమైనా...చిన్న వయసులోనే బాలికలపై కుటుంబ బాధ్యతల భారం పడుతోంది.

సమాచారమిస్తే చర్యలు



బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే.. 1098 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వండి. బాల్య వివాహాల నిరోధక చట్టం–2006 ప్రకారం చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చే వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, మహిళా చట్టాల గురించి ఇటీవల కాలంలో కేజీబీవీలు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం . అంతేకాకుండా ఈ ఏడాది ఆరంభం నుంచి 57 బాల్య వివాహాలను అడ్డుకుని బాలికలను రక్షించాం. అదేవిధంగా 9 పోక్సో కేసులు నమోదు చేయించాం.

– మహేశ్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

ఐదు నెలల్లో 57 బాల్య వివాహాలకు అడ్డకట్ట..
జిల్లా బాలల సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు, పల్లెల్లోకి అధికారులు వెళ్లి బాల్య వివాహాలతో కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. బాలికల చట్టాలు, మహిళలపై దాడుల నిరోధక చట్టాలు, పోక్సో కేసులు, బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి చెబుతున్నారు. ఇటీవల కాలంలోనే మూడు వందల మంది అధికారులు వివిధ అవగాహన సదస్సుల్లో సుమారు 40 వేల మంది విద్యార్థులకు బాల్య వివాహాలతో కలిగే అనర్థాల గురించి వివరించారు. అయినప్పటికీ కొందరు గుట్టుచప్పుడు కాకుండా బాలికలను పెళ్లిపీటలు ఎక్కిస్తుండగా...సమాచారం అందిన వెంటనే ఎక్కడికక్కడ బాల్య వివాహాలను అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలోనే గత ఐదు నెలల వ్యవధిలో 57 బాల్య వివాహాలు అడ్డుకున్నారు. జనవరిలో 8, ఫిబ్రవరిలో 14, మార్చిలో 11, ఏప్రిల్‌లో 16, మే నెలలో 8 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. అలాగే ఆయా కేసుల్లో ఫిబ్రవరిలో 2, మార్చిలో 3, ఏప్రిల్‌లో 2, మే నెలలో 2 పోక్సో కేసులు నమోదు చేయించారు.



బాల్య వివాహాల నియంత్రణపై పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు(ఫైల్)

ముగిసిన 'గురుకుల' కౌన్సెలింగ్
అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన కౌన్సెలింగ్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. నార్పల బీసీ గురుకుల పాఠశాలలో తొలిరోజు బాలురకు, రెండోరోజు బాలికలకు మెరిట్ జాబితా మేరకు కౌన్సెలింగ్ చేపట్టారు. ఆయా తరగతుల్లో మొత్తం 63 సీట్లకు గాను 1:2 నిష్పత్తిలో 126 మందిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయించారు. బీసీ గురుకుల పాఠశాలల జోనల్–4 ఆఫీసర్ రాజేంద్ర కుమార్ రెడ్డి, మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల కన్వీనర్ సంగీత కుమారి ఆధ్వర్యంలో ఈ కౌన్సెలింగ్ జరిగింది. ఉమ్మడి జిల్లాలోని అన్ని బీసీ గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీగా నాగమల్లేశ్వరి



నాగమల్లేశ్వరి

పుట్టపర్తి అర్బన్: సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ)గా నాగమల్లేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఐసీడీఎస్ పీడీగా పనిచేసిన లక్ష్మీకుమారి జూన్ 30న పదవీ విరమణ చేయగా, అధికారులు మడకశిర ప్రాజెక్టులో సీడీపీఓగా పనిచేస్తున్న నాగమల్లేశ్వరికి పీడీ (ఎఫ్ఏసీ)గా నియమించారు. దీంతో బుధవారం ఆమె కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమష్టిగా పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

అందుబాటులోకి సీటీ స్కాన్ సేవలు
అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం కింద ఎస్ఎల్ డయాగ్నస్టిక్స్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన సీటీ స్కాన్ మిషన్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 16 స్లైస్ మిషన్ ఉండేదని, ఇప్పుడు అధునాతన 32 స్లైస్ సిమన్స్ కంపెనీ మిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. రోగులకు త్వరగా స్కాన్ తీయడంతో పాటు కచ్చితమైన నివేదికలు వస్తాయన్నారు. సర్వజనాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేడియాలజీ హెచ్ఓడీ డాక్టర్ సురేష్, రేడియాలజిస్టు డాక్టర్ రాజేంద్రనాయుడు, డాక్టర్ మనోరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాం @ 8.782 టీంఎసీలు
బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)లో నీటి నిల్వ 8.782 టీఎంసీలకు చేరింది. డ్యాంకు ఇన్‌ఫ్లో హెచ్చు తగ్గుల మధ్య కొనసాగుతోంది. గత సోమవారం 11,854 క్యూసెక్కులు, మంగళవారం 13,410 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో బుధవారం ఉదయానికి 10,503 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం డ్యాం నుంచి 296 క్యూసెక్కుల నీరు వదలుతున్నారు. ప్రస్తుతం డ్యాంలో 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,587.11 అడుగులకు నీరు చేరింది. డ్యాం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.782 టీఎంసీల నీరు ఉంది. గతడాది ఇదే సమయానికి డ్యామ్‌లో 1,576.5 అడుగుల నీరు ఉండింది. 190 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండి 260 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది.



తుంగభద్ర జలాశయం

66 ఇంజినీరింగ్ కళాశాలలకు అనుమతి
- 8 కళాశాలల్లో సీట్ల కోత.. 4 కళాశాలలు మూసివేత
- జేఎన్‌టీయూ పరిధిలో ఇంజినీరింగ్, ఫార్మసీ సీట్ల ఖరారు



జేఎన్‌టీయూ పాలక భవనం

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో 2024–25 విద్యా సంవత్సరంలో 66 ఇంజినీరింగ్ కళాశాలలకు అనుమతి లభించింది. రెండు ఇంజినీరింగ్ కళాశాలలు కొత్తగా మంజూరయ్యాయి. ఈ మేరకు బుధవారం వర్సిటీ అకడమిక్ స్టాండింగ్ కౌన్సిల్‌లో ఆమోదం చేశారు. జేఎన్‌టీయూ పరిధిలో మొత్తం 43 వేల ఇంజినీరింగ్ సీట్లు ఉన్నాయి. వీటితో పాటు అదనంగా మరో 4 వేల కంప్యూటర్ సైనెస్ బ్రాంచ్ సీట్లు అందుబాటులోకి తెచ్చారు. కోర్ బ్రాంచ్‌ల్లో సగం సీట్లు కూడా భర్తీ అయ్యే పరిస్థితి లేదని, కంప్యూటర్ సైన్సెస్ సీట్లు అదనంగా కావాలని కోరడంతో ఈ మేరకు అనుమతి ఇచ్చారు. ఇంజినీరింగ్ బ్రాంచుల్లో సీట్ల పరిమితిపై ఉన్న ఆంక్షలను ఇప్పటికే ఏఐసీటీఈ ఎత్తివేయడంతో కళాశాల యాజమాన్యాలు ఎక్కువ సీట్లు కావాలని కోరినట్లు తెలిసింది.

8 ఇంజినీరింగ్ కళాశాలలకు షాక్..
ఇక వర్సిటీ పరిధిలోని 8 ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్ల కోత విధించారు. ఇందులో అనంతపురంలోనే రెండు ఇంజినీరింగ్ కళాశాలలు ఉండడం గమనార్హం. వాస్తవానికి ఈ 8 కళాశాలల అనుమతిని గతంలో రద్దు చేశారు. అయితే ఆయా కళాశాలల యాజమాన్యాలు వివిధ రకాలుగా ఒత్తిడి తీసుకురావడంతో సీట్ల కోత విధించి అనుబంధ హోదా మంజూరు చేసినట్లు తెలిసింది. అనంతపురంలో రెండింటితో పాటు చిత్తూరు జిల్లాలో ఒకటి, నెల్లూరు జిల్లాలో రెండు, కడపలో ఒకటి, అన్నమయ్య జిల్లాలో రెండు ఇంజినీరింగ్ కళాశాలలు ఈ జాబితాలో ఉన్నాయి. ఇదిలా ఉండగా, నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు తమకు అనుబంధ హోదా వద్దని అడ్మిషన్లకు అనుమతి తీసుకోలేదు. ఈ మేరకు సీట్లను ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయనున్నారు.

వినియోగదారులకు షాక్

- గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే యాప్‌ల ద్వారా కరెంటు బిల్లుల చెల్లింపునకు నో
- ఈ నెల నుంచి ఆర్బీఐ కొత్త నిబంధన
- ఇకపై ఏపీఎస్పీడీసీఎల్ యాప్ లేదా సంస్థ వెబ్‌సైట్ ద్వారానే సేవలు

గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే యాప్‌ల ద్వారా కరెంట్ బిల్లులు చెల్లించడం ఇకపై కుదరదు. విద్యుత్ సంస్థ ప్రవేశపెట్టిన మొబైల్ యాప్ apspdcl డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా కానీ లేదా సంస్థ వెబ్‌సైట్ www. apspdcl.inలోకి వెళ్లి కానీ బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఆర్బీఐ తీసుకొచ్చిన ఈ కొత్త నిబంధనతో వినియోగదారులకు షాక్ తగిలినట్టు అయింది.

తాడిపత్రి రూరల్: గతంలో విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు గంటల తరబడి క్యూలలో వినియోగదారులు వేచి ఉండాల్సి వచ్చేది. క్యూల్లో నిలబడలేని వారికి బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగేది. దీంతో అలాంటి వారు జరిమానాతో కలిసి బిల్లు చెల్లించాల్సి వచ్చేది. ఈ దుస్థితిని పారదోలుతూ, మారిన సాంకేతికతకు అనుగుణంగా ఫోన్‌పే, గూగుల్ పే, అమెజాన్ పే తదితర యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించే వెసులుబాటును విద్యుత్ సంస్థ కల్పించింది. మొదట్లో తక్కువగానే వీటి ద్వారా చెల్లింపులు జరిగినా మెల్లిగా పుంజుకున్నాయి.

75 శాతం ఆన్‌లైన్ చెల్లింపులే..
ఉమ్మడి అనంతపురం జిల్లాలో 12 లక్షలకు పైగా గృహ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. మరో రెండు నుంచి మూడు లక్షల వరకు హెచ్‌టీ సర్వీసులు, పరిశ్రమల సర్వీసులు ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రతి నెలా రూ. 300 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు విద్యుత్తు సంస్థకు ఆదాయం సమకూరుతోంది. దాదాపు 75 శాతం వినియోగదారులు ఫోన్‌పే, గూగుల్ పే, అమెజాన్ పే తదితర యాప్‌ల ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. 25 శాతం బయట విద్యుత్ సిబ్బంది ద్వారా కానీ, బ్యాంకుల ద్వారా కానీ బిల్లులు కడుతున్నారు.



ఆర్బీఐ కొత్త నిబంధన..
ఈ ఏడాది జూలై ఒకటి నుంచి ఆర్బీఐ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. యాప్‌ల ద్వారా చెల్లింపులు నిలిపివేసింది. గూగుల్ పే, ఫోన్ పే, పేటిఎం, అమెజాన్ పే ద్వారా ప్రజలు కరెంట్ బిల్లులు చెల్లించాక.. ఆ డబ్బు విద్యుత్ సంస్థకు అందడంలో జాప్యం జరుగుతుండడంతో ఇలాంటి చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. విద్యుత్ శాఖ యాప్ లేక వెబ్‌సైట్‌లో చెల్లిస్తే నేరుగా ఆ డబ్బు సంస్థకే చేరేలా వీటికి రూపకల్పన చేసినట్లు చెబుతున్నారు.

అవగాహన కరువు..
వివిధ కారణాలతో ఆర్బీఐ తీసుకొచ్చిన నిబంధన కారణంగా చాలా మంది వినియోగదారులు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. కొత్తగా విద్యుత్ శాఖ తీసుకొచ్చిన సౌకర్యంపై ఇప్పటి వరకూ ప్రజలకు అవగాహన లేదు. విద్యుత్ శాఖ సిబ్బంది కూడా చైతన్యం తీసుకురాలేదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఈ దిశగా చర్యలు తీసుకోవాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

అవగాహన కల్పించాలి



ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్‌ల్లో సులువుగా విద్యుత్ బిల్లులను చెల్లించేవాళ్లం. ప్రస్తుతం వాటి ద్వారా చెల్లింపులు నిలుపుదల చేయడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఇకపై విద్యుత్ శాఖకు సంబంధించిన యాప్‌లో గానీ వెబ్‌సైట్‌లో గానీ చెల్లించాలనే నిబంధన విధించినట్లు తెలిసింది. దీనిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.

– చక్రపాణి, న్యాయవాది, తాడిపత్రి

వినియోగదారులకు తెలియదు




ఆర్బీఐ కొత్త నిబంధన ప్రజలకు తెలియదు. యాప్‌ల ద్వారా ప్రతి నెలా మాదిరిగా విద్యుత్ బిల్లులను చెల్లిస్తే సరిపోతుందనుకుంటున్నారు. ఈ నిబంధనపై అధికారులు కూడా తెలియజేయలేదు. సకాలంలో బిల్లులు చెల్లించలేక పోతే గడువు మీరిందంటూ జరిమానా రూపంలో అదనంగా చెల్లించి నష్టపోవాల్సి ఉంటుంది.

– కుమారస్వామి, తాడిపత్రి

ప్రజలు సహకరించాలి
ఇకపై విద్యుత్‌శాఖ యాప్ లేదా వెబ్‌సైట్‌లో మాత్రమే వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాలి. జూలై ఒకటి నుంచి ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలిపివేశాం. ప్రజలు ఈ విషయంలో సహకరించాలి.

– నరసింహులు, విద్యుత్ శాఖ ఏఈ, తాడిపత్రి

కదిరిలో రెచ్చిపోయిన టీడీపీ కార్యకర్తలు
- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్‌పై దాడి
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన అంజాద్



కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంజాద్

కదిరి టౌన్: ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ కార్యకర్తలు రౌడీల్లా మారారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, సానుభూతి పరులు, ఆ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. తాజాగా బుధవారం కదిరి పట్టణం నడిబొడ్డున నలుగురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ మెగా అంజాద్‌పై దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని రాయలసీమ సర్కిల్‌లో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ మెగా అంజాద్ రెడీమేడ్ దుస్తుల దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం దుకాణం వద్దకు వచ్చిన టీడీపీ కార్యకర్తలు సూర్యశేఖర్‌రెడ్డి(సూరి), శివాజీ, హరినాథ్ రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి ''సిద్దారెడ్డి సార్‌కు డబ్బులివ్వాలంట..ఎప్పుడిస్తావ్..సార్ రమ్మంటున్నాడు'' అంటూ గొడవకు దిగారు. దీంతో అంజాద్ తాను ఎవరికీ బాకీ లేనని, అవసరమైతే సార్‌తోనే మాట్లాడతానంటూ బైక్‌పై సిద్దారెడ్డి వద్దకు బయలుదేరాడు. దీంతో అంజాద్‌ను అనుసరించిన టీడీపీ కార్యకర్తలు టవర్‌క్లాక్ సమీపంలో ఉన్న చర్చి దగ్గర అటకాయించారు. ''ఏమిరా... నువ్వు మా సార్‌తో మాట్లాడేంత వాడివా'' అంటూ ఘర్షణకు దిగారు. అంజాద్ సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా వారు వినిపించుకోకుండా దాడికి తెగబడ్డారు. నలుగురూ కలిసి అంజాద్‌పై పిడిగుద్దుల వర్షం కురిపించారు. ఈ ఘటనలో గాయపడిన అంజాద్ కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, ఈ విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు కూడా అంజాద్, అతని మామ షేక్ ఖాజాపై ఫిర్యాదు చేశారు. డబ్బులు అడిగినందుకు తమపై దాడి చేశారని, ఈఘటనలో శివాజీకి, సూరికి గాయాలైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై పట్టణ ఎస్ఐ బాబ్జాన్‌ను వివరణ కోరగా... ఇరువర్గాలు ఫిర్యాదు చేశాయని, విచారణ జరిపి ఆ తర్వాత కేసులు నమోదు చేస్తామన్నారు.

క్లుప్తంగా

ఖాద్రీశుడిని దర్శించుకున్న కర్ణాటక మంత్రి



మంత్రి మునియప్పకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని కర్ణాటక పౌరసరఫరాల శాఖ మంత్రి కె.ఎచ్.మునియప్ప బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్ణకుంభంతో అర్చకులు స్వాగతం పలికారు. విశేష పూజల అనంతరం స్వామి చిత్రపటం, శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాలకృష్ణయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన దుద్దుకుంట



వైఎస్ జగన్‌తో భేటీ అయిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లో జరిగిన పరిణామాలను ఆయన జగన్‌కు వివరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



చంద్రయ్య (ఫైల్)

తాడిమర్రి: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిమర్రి మండలం ఏకపాదంపల్లికి చెందిన గంగ్రగొడ్డలి చంద్రయ్య (48)కు భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కొళాయిలో బుధవారం ఉదయం తాగునీరు తక్కువగా వస్తుండడంతో చంద్రయ్య విద్యుత్ మోటార్‌ను అమర్చి స్విచ్ ఆన్ చేశాడు. ఈ క్రమంలో నీటిని పడుతుండగా విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చేపల వేటకు విరామం

- ఆగస్టు 31 అర్ధరాత్రి వరకూ నిషేధం
- నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు



రాయదుర్గం: జిల్లాలోని పెనకచెర్ల డ్యాం, పేరూరు అప్పర్ పెన్నార్ రిజర్వాయర్, బీటీ ప్రాజెక్ట్‌లో చేపల వేటను నిషేధించారు. ఈ నెల 1 నుంచి ఆగస్టు 31 అర్ధరాత్రి వరకూ చేపల వేటకు విరామం ప్రకటిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయి. దీంతో 61 రోజుల పాటు జాలర్లు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాల్సి వస్తోంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..

విరామ సమయంలో నిబంధనలకు విరుద్ధగా రిజర్వాయర్లలో చేపల వేట సాగిస్తే సంబంధిత జాలర్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు ఇప్పటికే అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనలు అతిక్రమించిన మత్స్యకారుల లైసెన్స్‌ల రద్దుతో పాటు ఏపీ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994, సెక్షన్ (4) కింద వలలు, బోట్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ మొత్తంలో జరిమానా విధిస్తారు. అలాగే ప్రభుత్వం అందించే అన్ని రకాల రాయితీలు, సౌకర్యాలను నిలుపుదల చేస్తారు.

ఏటా రూ.కోట్లలో లావాదేవీలు..

గార్లదిన్నె మండలంలోని పెనకచెర్ల వద్ద ఉన్న మిడ్ పెన్నార్ డ్యాం, రామగిరి మండలం పేరూరు సమీపంలోని అప్పర్ పెన్నార్ డ్యాంతో పాటు భైరవానితిప్ప ప్రాజెక్ట్‌లో చేపల పెంపకాన్ని ప్రభుత్వం అధికారికంగా చేపట్టింది. ఏటా ఈ మూడు రిజర్వాయర్లలో చేపల వేట ద్వారా రూ.కోట్లలో లావాదేవీలు జరుగుతుంటాయి. గతేడాది మిడ్ పెన్నార్ డ్యాంలో 8 లక్షలు, పేరూరులో 10 లక్షలు, బీటీపీలో 6.50 లక్షల చేప పిల్లలను వంద శాతం రాయితీతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుత సీజన్‌లో చేపల ఉత్పత్తి ఆశాజనకంగా ఉంది. ఒక్కో చేప కిలో నుంచి ఐదు కిలోల బరువుకు పెరిగాయి. ఇప్పటి వరకూ సాగించిన చేపల వేట ద్వారా గత సీజన్‌తో పోల్చుకుంటే పది శాతం మేర అదనపు ఆదాయం సమకూరింది.

ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు..

ప్రస్తుతం మిడ్ పెన్నార్ డ్యాంలో 100, పేరూరులో 120, బీటీపీలో 75 టన్నుల దిగుబడి చేతి అందే అవకాశం ఉందని అధికారులు ప్రాథమిక అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధన మేరకు కిలో రూ.100తో విక్రయించినా రూ.2.95 కోట్ల ఆదాయం మత్స్యకారులకు సమకూరుతుంది. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయంతో చేపల వేటపై ఆధారపడిన మత్స్యకారులు దాదాపు రెండు నెలల పాటు ఉపాధి కోల్పోయారు. మూడు రిజర్వాయర్ల పరిధిలో లైసెన్స్ కలిగిన మత్స్యకారులు 750 మంది ఉండగా, పరోక్షంగా వేలాది మంది జాలర్లు ఉపాధి పొందుతున్నారు. చేపల వేట నిషేధం ప్రకటించిన సమయంలో మత్స్యకారులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం గమనార్హం.

ప్రభుత్వం ఆదుకోవాలి



చేపల వేట నిషేధిత సమయంలో మత్స్యకారులకు పనులేవి ఉండవు. కుటుంబ పోషణతో పాటు ఈ రెండు నెలలూ ఆర్థిక కష్టాలు వెన్నాడుతాయి. వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి. వేట నిషేధిత సమయంలో కోస్తా ప్రాంతంలో అమల్లో ఉండేలా పరిహారాన్ని రాయలసీమ ప్రాంత మత్స్యకారులకూ వర్తింపజేయాలి.

– లోకప్ప, మత్స్యకారుడు, తాళ్లకెర

రిజర్వాయర్లలోకి అనుమతించేది లేదు



ప్రభుత్వ నిబంధన మేరకు ఆగస్టు 31 వరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వాయర్లలో చేపలు పట్టేందుకు అనుమతించేది లేదు. ఈ విషయంపై ముందుగానే జాలర్లను హెచ్చరించాం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆయా రిజర్వాయర్ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

– లక్ష్మీనారాయణ, ఎఫ్‌డీఓ, బీటీపీ

'పట్టు'కుంటే కాసుల వర్షమే

- సెరికల్చర్ అధికారి ఓబులేసు
- మల్బరీ సాగుపై రైతులకు అవగాహన



మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఓ ఓబులేసు

అనంతపురం అగ్రికల్చర్: మల్బరీ (రేషం) సాగుతో కాసుల వర్షం కురుస్తుందని రైతులకు సెరికల్చర్ అధికారి (ఎస్ఓ) ఓబులేసు సూచించారు. మల్బరీ సాగు విధానాలపై రైతులకు విరివిగా అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం గుత్తి మండలం మాముడూరు గ్రామానికి చెందిన కొందరు రైతులను కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి తీసుకెళ్లి అక్కడ పట్టు సాగు చేపట్టిన అభ్యుదయ రైతుల అనుభవాలు, లాభనష్టాలపై అవగాహన కల్పించారు. మల్బరీ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రోత్సాహక రాయితీలు ఇస్తుండడంతో రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఒక ఎకరా విస్తీర్ణంలో మల్బరీ సాగు చేస్తే రైతులకు రూ.22,500 ప్రోత్సాహకం అందుతుందన్నారు. అదే ఎస్సీ, ఎస్టీ రైతులకైతే రూ.27 వేలు ఇస్తామన్నారు. గరిష్టంగా ఐదు ఎకరాలకు ప్రోత్సాహకం వర్తిస్తుందన్నారు. పట్టు పురుగులు పెంపకానికి 20/50/16 కొలతలు కలిగిన పెద్ద షెడ్డు నిర్మాణానికి రూ.3 లక్షలు, అదే ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.3.60 లక్షలు ఇస్తామన్నారు. 20/30/16 కొలతలు కలిగిన చిన్న షెడ్డు నిర్మాణానికి రూ.2.25 లక్షలు కాగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.2.75 లక్షలు మంజూరవుతుందని వివరించారు. సూట్ రేరింగ్ స్టాండ్‌కు, నేత్రికలు (ప్లాస్టిక్ చంద్రికలు) ఇతర మందులకు కూడా ప్రోత్సాహక రాయితీలు ఉంటాయన్నారు. మార్కెట్‌లో బైవోల్టిన్ గూళ్లు విక్రయిస్తే కిలోకు రూ.50 చొప్పున ఇన్సెంటివ్ ఉంటుందన్నారు. అంతేకాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టు రైతులకు వర్తింపజేశారని, ఇది రైతులకు ఎంతో ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. మార్కెట్‌లో ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నందున మల్బరీకి మించిన లాభదాయకమైన పంట మరొకటి లేదన్నారు. తోటలో పంటను రెండు భాగాలుగా చేసుకుని సంవత్సరానికి సులభంగా 10 పంటలు పండించవచ్చన్నారు.

టీడీపీ కార్యకర్తల దాడి

ధర్మవరం రూరల్: మండలంలోని పోతులనాగేపల్లిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. గత కొన్నేళ్లుగా ఓ పొలం వివాదం కేసు కోర్టులో నడుస్తోంది. అయితే టీడీపీ అధికారంలోకి రాగానే ఆ పొలం తమదంటూ ఆ పార్టీకి చెందిన కార్యకర్తలు దౌర్జన్యంగా బుధవారం ఉదయం పొలంలో దుక్కి చేపట్టారు. అడ్డు చెప్పబోయిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు జయరాం, నాగభూషణం, సూరిపై టీడీపీకి కార్యకర్తలు కుమ్మర మహేష్, కుమ్మర శివ, నారాయణస్వామి, నాగిశెట్టి, ఆదినారాయణ ఇనుప రాడ్లు, కట్టెలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన బాధితులను స్థానికులు వెంటనే చికిత్స కోసం ధర్మవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. కాగా, తమపై కేసులు పెడితే హతమారుస్తామంటూ టీడీపీ కార్యకర్తలు బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

హతమార్చి.. గుండెపోటుగా చిత్రీకరించి!

- విద్యుత్ శాఖ ఉద్యోగి మృతి కేసులో వీడిన మిస్టరీ
- ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య
- పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసిన వాస్తవాలు
- నిందితుల అరెస్ట్



దాసరి ఆంజనేయులు (ఫైల్)

గుంతకల్లుటౌన్: నాలుగు రోజుల క్రితం గుంతకల్లులో చోటు చేసుకున్న విద్యుత్ శాఖ ఉద్యోగి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. కలకాలం తోడుండే భర్త కన్నా ప్రియుడే గొప్పనుకుంది. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి ప్రియుడితో కలిసి భర్తను హతమార్చింది. వాస్తవాలు బహిర్గతం కావడంతో నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య వెల్లడించారు. గుంతకల్లులోని రామిరెడ్డి కాలనీకి చెందిన దాసరి ఆంజనేయులు విద్యుత్ శాఖ ఏఏఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండేవాడు. ఆరేళ్ల క్రితం ఆయనకు ఆదోనికి చెందిన కావేరితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంతకాలంగా ఆదోనికి చెందిన పింజారి పీరాన్‌బాషాతో కావేరికి ఉన్న పరిచయం కాస్త వివాహేతర సంబంధంగా మారింది. ఈ క్రమంలో శాశ్వతంగా పీరాన్ బాషాతోనే ఉండిపోవాలని భావించిన కావేరి... ఇందుకు భర్త అడ్డుగా ఉండడంతో ఎలాగైనా ఆయనను కడతేర్చాలని ప్రియుడితో కలసి పథకం వేసింది. ఇందులో భాగంగానే జూన్ 29న రాత్రి 10:15 గంటలకు మద్యం సేవించి నిద్రమత్తులో ఉన్న ఆంజనేయులు ముఖంపై దిండుతో అదిమి ఊపిరాడకుండా చేసి హతమార్చారు. మరుసటి రోజు ఉదయం తన భర్త గుండెపోటుతో మృతి చెందినట్లు అందరినీ కావేరి నమ్మించింది. మృతదేహాన్ని పరిశీలించిన ఆంజనేయులు సోదరుడు దాసరి గాదిలింగ అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తొలుత అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కావేరి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో ఆమెను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో వాస్తవాలు వెలుగు చూశాయి. దీంతో బుధవారం కావేరితో పాటు పింజారి పీరాన్‌బాషానూ అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



బావిలో తేలుతున్న బాబు మృతదేహం

పుట్టపర్తి అర్బన్: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తి మండలం వెంగళమ్మ చెరువు గ్రామానికి చెందిన పింజారి బాబు (55)కు భార్య హుస్సేన్‌బీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాళ్లు కొట్టే పనికి వెళుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో పని ముగిసిన అనంతరం నాటుసారా తాగి ఇంటికి చేరుకునేవాడు. రెండు రోజుల క్రితం పనికి వెళ్లిన బాబు... తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఎక్కడో ఓ చోట తాగి పడి ఉంటాడని కుటుంబసభ్యులు అనుకున్నారు. అయితే బుధవారం మధ్యాహ్నం వెంగళమ్మ చెరువు గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఆయన మృతదేహం తేలింది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించారు. రెండు రోజుల క్రితం పని ముగించుకుని ఇంటికి బయలుదేరిన బాబు... మార్గమధ్యంలో బుక్కపట్నం మండలం నార్శింపల్లి తండాకు వెళ్లి నాటు సారా సేవించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో నాటుసారా మత్తులో తూలి బావిలో పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

వజ్రకరూరులో చోరీ

వజ్రకరూరు: మండల కేంద్రంలో నివాసముంటున్న టపాల్ సత్తార్ సాహెబ్ ఇంట్లో దుండగులు చొరబడి నగదు అపహరించుకెళ్లారు. వ్యక్తిగత పనిపై వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి ఆయన మరో ప్రాంతానికి వెళ్లారు. బుధవారం తిరిగి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి తాళాలు బద్దలుగొట్టి ఉండడం గమనించిన ఆయన లోపలకు వెళ్లి పరిశీలించారు. బీరువా ధ్వంసం చేసి అందులోని రూ.2 లక్షల నగదు అపహరించుకెళ్లినట్లుగా గుర్తించి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ నరేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుపై డీఈఓకు వినతి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు: జిల్లాలోని వివిధ మున్సిపాలిటీ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని డీఈఓ మీనాక్షికి యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ... జిల్లాలోని ధర్మవరం, కదిరి, హిందూపురం మున్సిపాలిటీల పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో బోధనాపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలన్నారు. సబ్జెక్టులు వారీగా ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలన్నారు. అలాగే జెడ్పీ ఉన్నత పాఠశాలలోనూ అవసరమైన మేరకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శులు సుధాకర్, లక్ష్మీనారాయణ, నరేష్‌కుమార్, నాయకులు బాబు, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయి నగదు రహిత వైద్య సదుపాయం కల్పించండి

- వైద్య శాఖ మంత్రికి నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ వినతి



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్టీఏ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తిస్థాయి నగదు రహిత వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌కు నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి శేషఫణి విజ్ఞప్తి చేశారు. మంగళవారం విజయవాడలో మంత్రిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. కరణం హరికృష్ణ మాట్లాడుతూ... 'ఉద్యోగుల ఆరోగ్య పథకం' పటిష్టంగా అమలు చేయాలని కోరారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అత్యవసర సేవలు ఉచితంగా అందించాలన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ గరిష్ట సీలింగ్‌ను తొలగించాలని కోరారు. ఈహెచ్ఎస్ అమలు కాని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఎంతైతే వ్యయం జరుగుతుందో అంత మొత్తాన్ని ప్రభుత్వమే భరించేలా చూడాలని విన్నవించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు నిర్దిష్ట కాలవ్యవధిలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. సంవత్సరానికోసారి జరగాల్సిన 'మాస్టర్ చెకప్'ను పటిష్టంగా అమలు జరిగేలా చూడాలన్నారు. వైద్య చికిత్సకు సంబంధించిన స్లాబ్‌లను ప్రస్తుతం స్లాబ్‌లకు అనుగుణంగా ఆధునీకరించాలని లేకపోతే పరిధిని పెంచాలని విన్నవించారు. సమయానికి పరిమితం చేయకుండా 24 గంటలు ఈహెచ్ఎస్ సేవలు కొనసాగించేలా చూడాలన్నారు. నగదు రహిత వైద్యం గరిష్ట పరిమితి రూ. 25 లక్షలు ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఇద్దరి కిడ్నాప్... వెంబడించి పట్టుకున్న పోలీసులు



కిడ్నాపర్ల దాడిలో గాయపడిన హనుమంతరాయుడు

కనగానపల్లి: ఇద్దరు వ్యక్తులను అపహరించుకెళుతున్న దుండగులను కనగానపల్లి పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన మేరకు... నెమలివరం గ్రామానికి చెందిన బొమ్మలాట హనుమంతరాయుడు, నరసింహులు బుధవారం సాయంత్రం యల్లకుంట్ల క్రాస్‌లో ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో ఇన్నోవా వాహనంలో వచ్చిన కొందరు వెనుక నుంచి ఢీకొన్నారు. అనంతరం ఓ బాలిక అదృశ్యమైన అంశంలో వారికి సంబంధం ఉందంటూ వాగ్వాదానికి దిగి బలవంతంగా కారులో ఎక్కించుకుని అనంతపురం వైపుగా బయలుదేరారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఇన్నోవా కారును వెంబడిస్తూ కొండపల్లి వద్ద అడ్డుకున్నారు. కిడ్నాపర్ల చెర నుంచి ఇద్దరిని కాపాడారు. దాడిలో తీవ్రగా గాయపడిన హనుమంతరాయుడిని ఆస్పత్రికి తరలించారు. కిడ్నాప్‌కు పాల్పడిన వారిని అనంతపురానికి చెందిన సి.నాగభూషణ, ఎం.సాయికుమార్, ఎస్.మనోహర్, బి.నారాయణస్వామి, రాఘవేంద్ర, బోయ దిలీప్‌కుమార్‌గా గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల వేదనతో యువకుడి మృతి

బత్తలపల్లి: కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక మనోవేదనకు లోనై ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు... బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లికి చెందిన బెస్త అన్నపాటి శ్రీనివాసులు (35)కు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. భార్య అనారోగ్యం బారిన పడడంతో చికిత్స కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో ఇంటి అవసరాలకు మరింత అప్పు చేశాడు. భార్యకు నయం కాలేదు. చివరకు ప్రైవేట్ బ్యాంక్‌లో ఇంటిని తాకట్టు పెట్టి రుణం తీసుకున్నాడు. ఈ క్రమంలోనే అప్పుల భారం పెరిగి ఎలా తీర్చాలో తెలియక మదనపడేవాడు. ఈ క్రమంలోనే బ్యాంక్ రుణం చెల్లించకపోవడంతో ఇంటిని వేలం వేస్తారనే వేదన మరింత కుంగదీసింది. దీంతో దాదాపు 30 రోజులుగా అన్నాహారాలు మానేసి తీవ్ర అస్వస్థతకు లోనైన శ్రీనివాసులు మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వానికి గ్రామస్తులు విన్నవించారు.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

ధర్మవరం అర్బన్: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని సుందరయ్య నగర్‌కు చెందిన నరసింహులు (78) ఆస్తమా వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే కొన్ని రోజులుగా కిడ్నీ సమస్య తలెత్తింది. దీనికి తోడు నరాల బలహీనతతో మతి స్థిమితం లేక ఇంటి నుంచి ఎప్పుడు పడితే అప్పుడు బయటకు వెళ్లిపోయేవాడు. కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన నరసింహులు... పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ హెచ్‌సీ ఎర్రిస్వామి కృష్ణ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, నరసింహులుభార్య లక్ష్మీదేవి నాలుగేళ్ల క్రితమే మృతి చెందింది. ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



నరసింహప్ప (ఫైల్)

రొళ్ల: పాముకాటుతో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం కాకి గ్రామానికి చెందిన నరసింహప్ప (50) వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి చేరుకున్న ఆయన భోజనం అనంతరం ఇంటి ఆవరణలో నిద్రించాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత పాము కాటు వేసింది. మూడు గంటల తర్వాత తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న నరసింహప్పను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. కాగా, ఆయన భార్య పుట్టమ్మ పదేళ్ల క్రితమే మృతి చెందింది. ముగ్గురు కుమారులు ఉన్నారు.

రేపు షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

పుట్టపర్తి: ఈ నెల 5న షూటింగ్ బాల్ సీనియర్స్ విభాగం ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు ఆ క్రీడా విభాగం కార్యదర్శి మనోహర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బుక్కపట్నంలో జరిగే ఎంపిక ప్రక్రియకు హాజరయ్యే క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. పూర్తి సమాచారానికి 95730 65966కు ఫోన్ చేయాలని సూచించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

రాయదుర్గం టౌన్: స్థానిక బైపాస్ రోడ్డు ముత్తరాసి కాలనీ సమీపంలోని కురాకులగుట్టపై ఓ వ్యక్తి అనుమానస్పదస్థితిలో మృతి చెందిన ఘటన బుధవారం వెలుగుచూసింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడిని బ్రహ్మసముద్రం మండలం ఎరిడికెరకు చెందిన ఎస్.నాగరాజు(63)గా నిర్ధారించారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న నాగరాజు... పొలం పనులకు అవసరమైన పనిముట్లు కొనుగోలు చేసేందుకు మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై రాయదుర్గానికి వెళ్లాడని తెలిపారు. రాత్రి ఇంటికి రాకపోవడంతో గాలింపు చేపట్టిన బంధువులు బుధవారం ఉదయం ముత్తరాసి కాలనీ బైపాస్ రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. అక్కడికి సమీపంలోనే పరమేశ్వరప్ప ఆలయం ఎదురుగా గుట్టపై మృతదేహం కనిపించింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, నాగరాజు మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

GNM (నర్సింగ్) అడ్మిషన్స్

■ On-Line అప్లికేషన్స్ స్టార్ట్. ఇంటర్ ఎనీ గ్రూప్ పాస్ స్టూడెంట్స్ కి GNM (నర్సింగ్) కోర్స్ నందు గవర్నమెంట్ సీట్స్ కలవు. ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర : ఎ.మురళి, 9030661651 అనంతపురం. [A-1271]

DISTANCE EDUCATION

■ ఆంధ్ర మరియు నాగార్జున యూనివర్శిటీ దూరవిద్యలో B.A., B.Com., B.Sc., మరియు M.A., M.Com., M.Sc, MHRM, MSW, B.Li.Sc, M.Li,Sc. మరియు Diploma Course లలో అన్ని గ్రూపులకు 2024 సం॥ అడ్మిషన్లు జరుగుచున్నవి. రఘువీరా టవర్స్ వెనుక, వస్త్ర షోరూమ్ సెల్లార్‌లో, అనంతపురము. సెల్ : 8333085320. [A-7017]

DSC COACHING

■ DSC Coaching for S.A Content only. Maths, Physical Science only content (Both EM & TM) Physics, Chemistry, Biology-up to Intermediate level 20 Yrs of experience faculty from corporate sector. # 2nd Road circle near, N- MAX Theatre, ATP. Cell: 9618562274. [A-7014]

B.TECH ADMISSIONS

■ AP EAPCET లో క్వాలిఫైడ్ స్టూడెంట్స్ కి B.Tech (Any Branch) లో ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. AP EAPCET క్వాలిఫైకాని వారికి, ఎంట్రన్స్ రాయని స్టూడెంట్స్‌కి కాలేజీ ఫీజు ఉండదు. Only హాస్టల్ ఫీజు కట్టుకోవలెను. Contact: జి. మురళి, సెల్ : 9030661651 అనంతపురం. [A-1270]

NURSING ADMISSIONS

■ AP EAPCETలో క్వాలిఫైడ్ స్టూడెంట్స్‌కి, B.Sc.(Nursing) నందు ఫ్రీ ఎడ్యుకేషన్ +కాలేజీలో హాస్టల్ కలదు. క్వాలిఫై కానివారికి AP EAPCET రాయని స్టూడెంట్స్‌కి GNM (నర్సింగ్), B.Sc (MLT), BTP (ఫిజియోథెరపీ), నందు ఫ్రీ ఎడ్యుకేషన్ కలదు. సంప్ర: జి. మురళి 9030661651, అనంతపురం. [A-1264]

శేఖర్ కోచింగ్ సెంటర్

■ 10th / ఇంటర్ ఫెయిల్ ఫ్రీ ట్యూషన్స్ శేఖర్ కోచింగ్ సెంటర్ Opp: G.R. ఫంక్షన్ హాల్, 3వ రోడ్డు, ATP. హాస్టల్ కలదు. సెల్ : 9440045441. [A-180]

REAL ESTATE

పొలం అమ్మబడును

■ అనంతపురం జిల్లా, పెద్దపప్పూరు(మం॥), అమ్మళ్ళదిన్నె పొలం సర్వే నెం. 564, 7 ఎకరాల విస్తీర్ణంలో రెండు బోరు బావులు కలిగిన పొలం అమ్మబడును. సంప్ర: 6305381896. [A-184]

SERVICES

CHANGE OF NAME

■ I, JADAPOLA ANUSHA (Old Name), W/o MARAPAREDDY GARI UDAYA BHASKAR REDDY, R/o D.No: 2-25, Thimmampeta (V), Garladinne (M), Anantapuramu (D). Changing my name from JADAPOLA ANUSHA (Old Name) To MARAPAREDDY GARI ANUSHA (New Name). Henceforth, I am being called as MARAPAREDDY GARI ANUSHA for all purposes. [A-1272]

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1185254]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 95026 15217. [M-1185232]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో పని చేయుటకు లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-13695]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K సంప్ర : 9640258899, 9640468899 [H-796175]

■ దండపాని రియల్‌ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫిక్స్ శాలరీ 10,000 నో టార్గెట్ అనుభవం కలవారికి ప్రాధాన్యత ప్లాట్ నెంబర్ 204, లోటస్ గ్రాండ్, రాంనగర్ అనంతపురం.Contact 6300725354. [A-183]

■ WANTED TEACHER'S: MATHS, ENGLISH,HINDI for 6th to 10th EM. Un-Trained (UG/PG) also preferable but 2 years teaching experience must. For Staying teachers providing Food & Accommodation. For Daily Travelling 30KM (TA). Contact: VIGNAN EM HIGH SCHOOL, Somandepalli, Near Penukonda, Sri Sathya Sai (Dist) A.P. Cell: 8309913221, 9347986668. [A-1268]

■ GOLDEN OPPORTUNITY for Insurance Agents and Sale Managers మీ స్వంత సేల్స్ టీం ని నియమించుకొని బిజినెస్ అభివృద్ధి చేసుకోండి మరియు ఆకర్షణీయమైన జీతంతో పాటు పెట్టుబడి లేకుండా వ్యాపారవేత్తగా మారే అవకాశం. సంప్రదించండి : అలెగ్జాండర్ లగ్జరీ హోటల్, సప్తగిరి సర్కిల్, అనంతపురము. ఇంటర్వ్యూ : తేది : 4 జూలై, 2024, మధ్యాహ్నం: 3 గం॥లకు. Followed by Hi Tea. Register your Seat : 6364301913. [A-3260]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.